# 108వ పుష్పము

108. ఓం శ్రీ సాయి - భగవాన్ శ్రీ సత్యసాయిబాబాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

భగవాన్ = (1) సంపూర్ణ ఐశ్వర్యము, ధర్మము, యశము, సంపద, వైరాగ్యము, మోక్షము, ఈ ఆరును భగ మన బడును. ఇవి గలవాడు భగవాన్. (2) భూతముల యుత్పత్తి, స్థితి లయములను, వాని రాకపోకలను, విద్యా విద్యలను ఎరింగినవాడు భగవంతుడు.

సత్యుడు = సజ్జనులకు మంచివాడు. ఎట్టి కారణము లేదు, ఇతనికి కారణమే లేదు, కావున ఒక్క జీవుడును పుట్టుటయే లేదు అనుట సంభవించుచున్నది.

సత్వవంతుడు = శౌర్యము మున్నగు బలము గలవాడు.

సత్య ధర్మ పరాయణుడు = సత్యమును పలుకుటయందును, ధర్మమును తెలుపుట యందును, నిలకడగా నుండు వాడు. ప్రాచీనములగు ఉపనిషాది గ్రంథములయందు - బ్రహ్మతత్త్వ ప్రాప్తికి - ఉపాయములుగా చెప్పబడిన, సత్యముల లోపల, ఇదియే ఉత్తమమైన సత్యము. అసత్యమేదియనగా, సత్యస్వరూపమగు బ్రహ్మము నందు, అణుమాత్రమైనను, ఏమియు పుట్టుట లేదనుటయే.

వివరణము = అనాదులగు, ఉపనిషాది గ్రంథములందు, తదర్థ, వివరణ భూతములుగా, వ్యాసాదులగు పూర్వులు ఒనర్చిన గ్రంథములందును, మనస్సు, సృష్టి, ఉపాసనము, ఉపాసకుడు మున్నగువానిని గూర్చి చెప్పబడియున్నవి. ఇవి పర మార్థ సత్యత్వ భూతమగు బ్రహ్మము యొక్క ప్రాప్తికి, ఉపాయముగా చెప్పబడియున్నవి. గనుక, వీనికి వ్యవహార సత్యత్వమే గాని పారమార్థిక సత్యత్వము లేదు. వ్యవహారిక సత్యములగు ప్రతిబింబాదికముచేత, పరమార్థ సత్యభూతమగు, ముఖ, సూర్యాది, అధిష్ఠాన ప్రాప్తి కలుగుచుండుట, అనుభవ సిద్ధమేకదా! (2) నిత్యమైన (వ్యర్థముకాని) యాత్మగల పరమాత్మ, (3) శరీరము గలవాడుగను, శరీరము లేనివాడుగను యున్న పరమాత్మ, (4) ప్రాణాన్నాదిత్య రూపముగలవాడు పరమాత్మ, ఐశ్వర్య, ధర్మ, జ్ఞాన, వైరాగ్య, యశస్సు శ్రీలు అనే ఆరింటికిని, నిలయుడు కాన, అట్టి సాయి పరమేశ్వరునకు నమస్కారము.

2) కవీశ్వరుడైన వాణీస్వరూపుడు

ప॥ బ్రహ్మదర్శన భాగ్యంబు బడయగోరిఁ
వెదుకబోవుదు నెచటికే వెర్రి మనసా ॥
అదియు నీలోన నున్నది, గాంచు మచట
సత్యమును తెలుపుమాట, యీ సాయిమాట ॥

దివ్యశ్రీ గౌడపాదీయ అద్వైత దర్శనము (Cont.):

మనస్సు ఎప్పడు గ్రాహ్య గ్రాహక రూప అవిద్యాకృత మలద్వయ వర్జితమగుచున్నదో, అప్పడు పరమును, అద్వైతమును అగు బ్రహ్మమే యని అగుచున్నది. భయ నిమిత్త భూతమగు ద్వైత గ్రహణము లేదు. కావున అది నిర్భయము, శాంతమగు బ్రహ్మము జ్ఞానాలోకమనంబడును. విజ్ఞాన, ఏక, రసఘనము, అంతటను, ఆకాశమువలె నిరంతరము వ్యాపకమగునది సమంతత మనబడును. బ్రహ్మము = అజము, అనిద్రము, అస్వప్నము, సకృద్విభావము, సర్వజ్ఞము, నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావము కలది. అనామము, అరూపకము, సర్వవిశేష విరహితుడగుటచేత వికారరహితుడు, సుప్రశాంతుడు, సకృజ్జ్యోతి, సమాధి శబ్దవాచ్యుడు, అచలుడు, అభయుడు.

ఆత్మతత్త్వమనగా జీవ పరమాత్మలకు, ఏకత్వము గనబరచుచున్నట్టి దర్శనము. ఈ ఆత్మతత్త్వము, సర్వ సంబంధము

లను పేరు గల స్పర్శములచేత, వర్జితమగుటచేత, అస్పర్శ యోగమను నామముతో, ఉపనిషత్తులలో ప్రసిద్ధిని వహించినది. మనో నిగ్రహాదికమంతయు - మృత్తిక, లోహము వంటివి. పరమార్థ తత్త్వ ప్రాప్తికి, ఉపాయ భూతముగా, సృష్టి, ఉపాసనము చెప్పబడినది కాని, పరమార్థ సత్యముగా నేమియు చెప్పబడలేదు.

పరమార్థ సత్యము = కర్తయు, భోక్తయు అగు జీవుడు ఒక్కడై, ఏ విధముగానైనను పుట్టుటయే లేనందున, స్వభావముగా అజుడు, అద్వితీయుడును అగుచున్నాడు. ఈ ఆత్మకు అద్వైత దర్శనమే అస్పర్శ యోగమనబడును. వర్ణాశ్రమాది ధర్మములచేతను, పాపాది మలములచేతను, స్పర్శము లేనిది యగుటచేత "అస్పర్శ యోగము" అని అన్వయార్థము. శ్రు॥ "నలిప్యతే కర్ణతా పాపకేన" (బృహ 64-23) ఆత్మదర్శనము ఆత్మ సత్యా సుబోధము చేతనే తెలిసికొనవలెను. బ్రహ్మ స్వరూపులకు, అభయము, మోక్షము అను పేరుగల అక్షయమగు శాంతియు, స్వభావముగనే సిద్ధించుచున్నవి. అవి మనోనిగ్రహాధీనములు కదా!

మనో నిగ్రహము = ఉత్తమ అధికారాలకు

మధ్యమ, అధమ అధికారులకు సత్కర్మానుష్ఠానము

మనోనిగ్రహము - ఇది విసుగులేక ప్రయత్నించవలెను.

(కుశాగ్రము ఆఖ్యాయిక) ఇదే విధముగా, విసుగు, విరామము లేక, మనోనిగ్రహ రూపమగు, పరమ ధర్మమునందు, ప్రయత్నించునట్టి, ముముక్షువు నందు, పరమేశ్వరుడు అనుగ్రహము కలిగి వానికి మనో నిగ్రహము కలుగును. ఈ మనో నిగ్రహము, జ్ఞాన వైరాగ్యములచేత పొందవచ్చును. అప్పుడు మనస్సు ఆత్మలో ఐక్యమొందును.

చిత్తము ఎప్పుడు బ్రహ్మ భావము పొందును? = జ్ఞాన వైరాగ్య అభ్యాస యుపాయము చేత, నిరోధింపబడిన, చిత్తము (మనస్సు) ఎప్పుడు సుషుప్తియందు (కారణాత్మకముగ) లీనముగాక యుండునో, (2) విషయములయందు విక్షేపము పొందకయుండునో, నివాత ప్రదేశమునందున్న దీపమువలె నిశ్చలమై యుండునో, (3) కల్పితమగు ఏ విధమైన విషయ భావము చేతగాని, అభావము గాక యుండునో, అప్పడే ఇట్టి లక్షణములుగల చిత్తము బ్రహ్మ మగుచున్నది. బ్రహ్మ స్వరూపమే చిత్తము. ఇదే అసంప్రజ్ఞాత సమాధి.

పరమార్థ సుఖము = స్వస్తము, శాంతము, సనిర్వాణము, అకథ్యము. ఇంక ఏమన, గుడము యొక్క మాధుర్యము వలె స్వానుభవ మాత్రము చేతనే గ్రహింపదగినది కాని, వాక్కుతో చెప్పటకు వీలులేదు. నిరతిశయ సుఖము పుట్టదు. అందుచే అజము - అజమగు జ్ఞేయము కంటే భిన్నము కానిది. స్వరూపమగు, సర్వజ్ఞ రూపముతో సర్వజ్ఞమయినది. ఇట్టి సర్వజ్ఞమగు బ్రహ్మమే సుఖమని, బ్రహ్మ విదులు పలుకుచున్నారు.

3) సకలతత్త్వ బోధకుడు - దేవుడెక్కడ

"అంతటను వున్న దేవుని వెదికే దెక్కడ? కొందరు "ఎన్నో సాధనలు చేస్తున్నాము, భగవంతుడు మాత్రము కనిపించడం లేదు" అని అంటారు. భగవంతుని వెతికేవారు, అన్వేషణ సలిపేవారు కోట్ల కొలదిగా కనిపిస్తూ యుంటారు; కాని ఇది కేవలం వెర్రితనము. ఎక్కడ చూస్తే అక్కడయున్న భగవంతుని వెదికే దెక్కడ. చాలా పొరపాటు పడుచున్నారు. ప్రజలు, సాధకులు భగవంతుని వెదుకుచున్నారా? లేక భగవంతుడే సాధకుని వెదకుచున్నాడా? యోచించాలి. సంపూర్ణ శరణాగతుడైన వాడు లోకంలో ఎక్కడా కనిపించడం లేదు. భక్తుని నిమిత్తమే భగవంతుడు వెదకుచున్నాడు. కాని భగవంతుని మీరు వెదకనక్కర లేదు.

"సర్వతః పాణి పాదం, సర్వతోక్షి శిరో ముఖం" ॥

వెంట, జంట, ఇంట వుండి, కంటి రెప్పవలె కాపాడుచున్నాడు. కనుక ఈ విశాలతత్త్వాన్ని మీరు గుర్తిస్తే, భగవంతుని వెదకటానికి మీరెంత మాత్రము ప్రయత్నించరు. తాను లేని స్థానము, తనది కాని రూపము, జగత్తులో కానరాదు. ఈ విశ్వాసాన్ని మనము బలపరచుకోవాలి. సరియైన భక్తుని లక్షమిదే. జపములు, ధ్యానములు, పూజలు, యోగములు ఇవి అన్నీ కాలమును పవిత్రము కావించుకునే కర్మలు మాత్రమే. ప్రేమ దైవము. ఇటువంటి ప్రేమను అభివృద్ధి పరచుకొని

దైవత్వాన్ని ఎక్కడ చూచినా, అక్కడ ఉన్నాడనే విశ్వాసముతో అతనిని ధ్యానిస్తూ ఉంటే ఎక్కడంటే అక్కడే కనిపిస్తాడు" (25-12-86).

4) జ్ఞానస్వరూపుడు - శ్వేతాశ్వతరోపనిషత్తు (3వ అధ్యాయం)

ఉ॥మం॥ సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరో ముఖం ।
సర్వత స్మృతి ముల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥6॥

ఆ పరమేశ్వరుడు సర్వత్ర కాళ్ళు, చేతులు గలవాడు. అంతటను కన్నులు, తలలు, ముఖములు, చెవులు గలవాడునై, సకల లోకములందును వ్యాపించి యున్నాడు.

ముండకోపనిషత్తు (2-2-11)

ఉ॥మం॥ బ్రహ్మై వేద మమృతం పురస్తా। ద్బ్రహ్మ పశ్చాద్బ్రహ్మ
దక్షిణ తశ్చోత్తరేణ అథశ్చోర్ధ్వం చ ప్రసృతం। బ్రహ్మై
వేదం విశ్వ మిదం వరిష్ఠమ్ ॥

తా॥ ఎయ్యది సూర్యాది సర్వ జ్యోతులకు కూడా జ్యోతిస్సని చెప్పబడుచున్నదో, అట్టి బ్రహ్మ మొక్కటియే సత్యమనియు, తద్భిన్నమైన దంతయు వికారమైనది కావున అసత్య మనియు అను విషయము శ్రుతి ప్రమాణం చేతను, యుక్తి ప్రమాణం చేతను ప్రతిపాదింప బడిన విషయమునే మరల యుదహరించి చెప్పబడుచున్నది. ముందు వెనుకను, ప్రాగాది దిక్కుల యందును బ్రహ్మముకంటె వేరగు కార్య కారణ రూపమున పరిణమించిన దంతయు బ్రహ్మమే కాని మరొక్కటి కాదు. రజ్జువునందు సర్పభ్రమ అవిద్యా వశముచేత ఎట్లు కలుగుచున్నదో, అట్లే సత్యమగు బ్రహ్మమునందు కూడా అవిద్యా వశము చేత బ్రహ్మముకంటె భిన్నమగు, కార్యరూప ప్రపంచ బుద్ధి తోచుచుండును.

పూర్వ భాగమునందు గల ఈ సమస్తము నాశ రహితమగు బ్రహ్మమే. వెనుకనున్న ఈ సమస్తము బ్రహ్మమే. దక్షిణ దిగ్భాగమునందును, ఉత్తర దిశయందును గల ఇది యంతయు బ్రహ్మమే. అధో దిగ్భాగమునందును, అంతటను వ్యాపించి యున్న ఇది అంతయు బ్రహ్మమే. కనుక కనబడుచున్న ప్రపంచమంతయు శ్రేష్ఠమగు బ్రహ్మమే.

ఛాందోగ్యోపనిషత్తు

నారదుడు సనత్కుమారుని అడుగుచున్నాడు.

"స భగవః కస్మిన్ప్రతష్ఠిత ఇతి"

సనత్కుమారుడు చెప్పుచున్నాడు.

"స్వేమహిమ్న"

తా॥ నారదుడు వస్తు స్వరూపము విస్పష్టముగ తెలియగోరి, అఖండా ద్వితీయ నిర్వికార సత్తామాత్రము భూమా స్వరూపమైనది. "అది ఏ అధిష్ఠానమును ఆశ్రయించి యున్నది."

సనత్కుమారుడు "ఈ అద్వితీయ భూమా స్వరూపము వ్యవహార దృష్టిచే చూచిన స్వాత్మ విభూతి యందే ప్రతిష్ఠితమై యున్నది. పరమార్థ దృష్టిచే చూచిన కేవల సత్తామాత్ర స్వరూపముగా స్థిరమై యున్నది. కనుక విభూతి యని మరియొక ఆశ్రయమైనది గాని లేదని తెలియవలెను".

4) ఇందుగల డందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందే గలడు దానవాగ్రణి వింటే ॥ (భాగవతము)

5) ప్రేమ స్వరూపుడు -

"పలువిధ సంపదలు, ఆస్తులు, అధికారాలు, పేరు ప్రఖ్యాతులు అంత విలువైనవి కావు. ప్రేమ అనే అమూల్యమైన

ఐశ్వర్యం మానవుని జీవితంలో సర్వస్వం ప్రేమ శూన్యమైన హృదయం నిబిడాంధకారమైన శిథిల మందిరము. అందులో దుశ్చింతలనే గబ్బిలములు నివశించును. అశాంతి అను దుర్వాసనకు అది ఆలవాలము. ప్రేమయను జ్యోతి హృదయము నిండెనా దుశ్చింతలు మాయమై శాంతి నెలకొనును." (స్వామి)

దివ్యలీల : స్వామికి చాలామంది పాశ్చాత్య భక్తులున్నారు. వారిలో ఇంద్రాదేవి ఒకరు. 1968 సం॥లో పుట్టపర్తిలో స్వామిని దర్శించింది. ఆమె జీవితంలో పెద్ద మార్పు వచ్చింది. ఆమె జన్మించినది రష్యాదేశం, అమెరికాలో పెరిగింది. స్వామి దర్శనం అనంతరం పేరు మార్చుకుని ఇంద్రాదేవి అయింది. మెక్సికోలో ఒక యోగ శిక్షణా కేంద్రం నడుపుతున్నది. డాక్టరు సాండలీసు స్వామిని గురించి తెలిసికొనినది ఈమె నుంచే. స్వామి ఆమెకు విభూతి భరణి సృష్టించి ఇచ్చారు. అది ఎప్పుడూ నిండే వుంటుంది. అందుచే అక్షయమన్నారు. ఎంతమంది కిచ్చినా తరగదు ఆ విభూతి.

దివ్య చికిత్స : డా. యన్.సత్యనారాయణ విజయవాడలో ప్రాక్టీసు, 62 సం॥ల వయస్సు, పక్షవాతం వచ్చింది. భార్యతో పుట్టపర్తి వెళ్ళి, స్వామిని దర్శించాడు. "ఫరవాలేదు" అన్నారు స్వామి. వీపు నిమిరి విభూతి ఇచ్చారు. కొద్ది రోజులలోనే బాగు అయింది.

6) సర్వజన ప్రియుడు -

జీవిత సర్వస్వము ప్రేమయే (యం.రామమోహనరావు)

ఈసారి భగవంతుడు చిత్రావతి నది ఒడ్డున ఉన్న పుట్టపర్తి యను చిన్న గ్రామం ఎన్నిక చేశారు. తన అవతారమునకు ఇది ఆంధ్రదేశం అనంతపురం జిల్లాలో యున్నది. పుట్టపర్తి, సత్యాన్వేషణా కేంద్రం అయింది. అనేక దేశాల నుండి భక్తులు, సాధకులు, ఆర్తులు స్వామి దర్శనానికి వస్తూ వుంటారు. పుట్టపర్తిలోని చిన్న యిల్లు వారి జన్మస్థలం. క్రీస్తు కూడా బేతిల్ హమ్ అనే పాలెస్తినాలో యుండే, చిన్న పల్లెటూరులో జన్మించాడు. రోగులను బాగుచేయడం, బీదవారిని ఆదుకోవడం, అవిటి వారికి సేవచెయ్యడం, క్రీస్తు చేసిన పనులు, అట్టివే స్వామి చేయుచున్నారు. క్రీస్తువలె కరుణామూర్తిగా నాకు స్వామి కనబడినారు. 60 సంవత్సరముల క్రిందట జన్మించిన స్వామి, తన ప్రేమను ప్రపంచ మంతయు వెదజల్లుచున్నారు. అధర్మ మార్గంలో నడిచే వారికి, ధర్మమార్గం చూపిస్తున్నారు. స్వామి అనుజ్ఞలేనిదే పుట్టపర్తి ఎవ్వరు రాజాలరు. ప్రతినిత్యం భక్తులు, విదేశాల నుండి వస్తూనే యుంటారు. ఎంత దూరానవున్నా వారి ప్రేమను అందిస్తూనే యుంటారు. తన దగ్గరకు తీసు కుంటారు స్వామి.

7) స్తుతి ప్రియుడు - దివ్యభజన

విశ్వమోహిని । సాయి నారాయణి ।<br>
క్షీరాబ్దిశయనీ । సాయి నారాయణి ॥వి॥<br>
లక్ష్మి మనోరమ । కాంచన భరణి ।<br>
కమలా కాంతిని । సాయి నారాయణి ।<br>
శుభ సంపద । సౌభాగ్య ప్రదాయని ॥వి॥

దివ్యశాంతి (Cont.) : అంతర్యామియగు ఈశ్వరుడు, సర్వజీవుల హృదయము నధిష్ఠించి, యంత్ర పాంచాలికలవలె. మాయ వలన వానిని అనగా దేహాభిమానులగు జీవులను నియమించుచున్నాడు. "ఏకోదేవః సర్వభూతేషుగూఢః సర్వ వ్యాపీ, సర్వ భూతాంతరాత్మ, కర్మాధ్యక్షః, సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ" (శ్వేశ్వ 6-11) అందుచే జీవులం దరును పరమేశ్వర పరతంత్రులగుట వలన అహంకారమును పరిత్యజించి, సంసారార్తి నాశనము కొరకు భక్తులు, సర్వతో భావమున, ఈశ్వరునే శరణు పొందాలి. ఆయన కృప వలన, భక్తుడు పరమ శాంతిని (మోక్షమును) పొందును. "నసంశయః" సంశయముగాని, సందేహముగాని లేదు. భక్తుడు, భగవంతునియందు, మనస్సు నిల్పాలి. అనన్య భక్తుడు కావాలి, పూజించాలి, నమస్కరించాలి. ఈ రీతిగా భక్తుడు పరమేశ్వరుని పొందగలడు. ఇది భగవంతుని సత్య ప్రతిజ్ఞా

వచనము, సంక్షిప్తంగా, ధర్మాధర్మముల అనుష్టానముల పరిత్యజించి, గర్భ - జన్మ - జరామృత్యు వర్జితుడును, సర్వాత్ముడును, పరమేశ్వరుడును అగు భగవంతుని ఒక్కనినే ఆత్మ రూపమున ఆశ్రయించాలి. భగవంతుడొక్కడే యున్నాడు. ఆయనగాక మరి ఏమియులేదు. "నేనా నానాస్తి కించన" అను దృఢ నిశ్చయుడు కావాలి భక్తుడు. ఇట్టి నిశ్చిత బుద్ధియుంటే, భగవంతుడు తన స్వరూపమును ప్రకటించి, ధర్మా ధర్మ బంధములగు పుణ్యపాపముల నుండి ముక్తి నొనర్చును. పరమశాంతిని ప్రసాదించును.

8) వేదాంతవేద్యుడు - సాయి పరమేశ్వరుడు

81) ఉపేంద్రుడు = ఇంద్రునికి పై వాడు.
82) వైద్యుడు = సకల విద్యలను ఎరుంగువాడు.
83) సదాయోగీ = ఎల్లప్పడు ఆవిర్భవించిన రూపము గలవాడు.
84) మహాశక్తి = ఎక్కువ సామర్థ్యము గలవాడు.
85) గోవిందుడు = గోవులకు ఇంద్రుడు అనగా ప్రభువు.
86) ప్రజాపతి = ప్రజలకు తండ్రియైన వాడు.
87) అజుడు = వ్యాపించువాడు, ప్రేరేపించువాడు, పుట్టుక లేనివాడు.
88) సత్యుడు = సత్యవచనమగు ధర్మ రూపుడైన వాడు, సత్యమునకు సత్యమైన వాడు.
89) సహస్రాక్షుడు = పెక్కు కన్నులు కలవాడు.
90) నారాయణుడు = ఉదకములే నివాసస్థానముగా గలవాడు.
91) శుచి = నిర్మలుడు
92) విష్ణువు = సర్వవ్యాపకుడు.
93) ప్రకాశనుడు = అందరినీ ప్రకాశింపచేయువాడు.
94) ఓజస్తేజో ద్యుతిధరుడు = ఓజస్సు, తేజస్సు అయినవాడు. జ్ఞాన లక్షణంబైన దీప్తి గలవాడు.
95) ఔషధుడు = సంసారమనెడి రోగమునకు ఔషధమైన వాడు.
96) పావనుడు = పవిత్రతను కలుగజేయు వాడు.
97) అదృశ్యుడు = అవాఙ్మానస గోచరుడు.
98) ఇష్టుడు = పరమానందరూపుడు.
99) అచ్యుతుడు = షడ్భావ వికారములు లేనివాడు.
100) వాసుదేవుడు = అంతయూ అచ్ఛాదనము చేయుచు, ప్రవేశించువాడు.
101) అశోకుడు దుఃఖము మొదలగు, ఆరూర్ములు (అలలు) లేనివాడు.
102) అతులుడు = సాటిలేని వాడు.
103) దామోదరుడు = లోకములను తనయందుంచు కొన్నవాడు.
104) పరమేశ్వరుడు = గొప్పవాడగు ఐశ్వర్య స్వభావము గలవాడు.
105) రాముడు = సత్యానంద స్వరూపుడగు నీతనియందు యోగులు రమింతురు.
106) జ్ఞానగమ్యుడు = జ్ఞానముచేతనే పొందదగిన వాడు.
107) ఆనందుడు = ఆనందమే రూపముగా గలవాడు.
108) భగవంతుడు = సంపూర్ణ ఐశ్వర్యము, ధర్మము, యశము, సంపద, వైరాగ్యము, మోక్షము గలవాడు.

**ఓం తత్సత్**

"యద్యత్కర్మ కరోమి, తదఖిలం
శంభోతవారాధనమ్"        (శ్రీ శంకరులు)

తా॥ నేను ఏ కర్మ చేసినా - సాయి శంభో, అది అంతయు నీ ఆరాధనమే ॥

శ్లో॥ కాయేన వాచా మనసేన్ద్రి యైర్వా
బుద్ధ్యాత్మనావా ప్రకృతేస్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణ యేతి సమర్పయామి ॥
సత్యనారాయణ యేతి సమర్పయామి ॥

ఓం తత్స బ్రహ్మార్పణమస్తు ॥
సకలం శ్రీ సాయి పరమేశ్వరార్పణమస్తు ॥

తా॥ ప్రకృతియొక్క స్వభావము వలన నేను, కాయము (శరీరము) చేతను, వాక్కు చేతను, మనస్సు చేతను, ఇంద్రి యముల చేతను, బుద్ధిచేతను, దేనిని చేయుచున్నానో దానినంతయు, సర్వోత్కృష్టుడగు సాయి నారాయణుని కొరకే సవ ర్పించుచున్నాను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ఓం తత్సత్**